క్లుప్తంగా

10 నుంచి రెవెన్యూ సదస్సులు

కొత్తపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 10వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చిన్నారావు శుక్రవారం తెలిపారు. 10న అమీనాబాద్, 11న గొర్స, 12న ఇసుకపల్లి, 13న కొమరగిరి, 17న కొండెవరం, 18న అమరవిల్లి, 19న కొత్తపల్లి, 20న కుతుకుడుమిల్లి, 21న మూలపేట, 23న నాగులపల్లి, 24, 27న పొన్నాడ, 28న రమణక్కపేట, శ్రీరాంపురం, 31న ఉప్పాడ, జనవరి 2న సుబ్బంపేట, 3న వాకతిప్ప, 4న యండపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు వివరించారు.

నేడు మెగా పేరెంట్స్ మీట్

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ మీట్ నిర్వహిస్తున్నట్టు ఎంఈఓ వై.శివరామ కృష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని 75 పాఠశాలల్లో జరిగే తల్లిదండ్రుల సమావేశంలో ప్రతి ఒక్కరూ హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలలో మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు సంబంధించి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. శనివారం మెనూలో విద్యార్థులకు వైట్ రైస్, పప్పు, వెజిటబుల్ కర్రీ, స్వీట్ పొంగల్, చిక్కి, రాగిజావ ఇవ్వడం జరుగుతుందన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు


పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తిలో పేకాట శిబిరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.42,100 స్వాధీనం చేసుకున్నట్లు గొల్లప్రోలు ఎస్సై నౌడు రామకృష్ణ తెలిపారు. చెందుర్తి గ్రామ శివారున గల కొండపై రహస్యంగా పేకాట నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా నిందితులు చెందుర్తి గ్రామానికి చెందిన వారని తెలిసిందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు.

కొత్తపల్లి మండల గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులు

కొత్తపల్లి

గ్రామ సచివాలయం	ఫోన్ నెంబర్
ఉప్పాడ- 1	9951422177
ఉప్పాడ-2	6304179606
ఉప్పాడ-3	6976476445
ఉప్పాడ-4	9494464562
కొత్తపలి	9949470886
కొమరగిరి-1,2	9492143912
రమణక్క పేట	8185994997
శ్రీరాంపురం	8185994997
కొండెవరం-1	9492834413
కొండెవరం-2	8886384494
మూలపేట	9133666825
నాగులపల్లి-1,2	9493288248
అమీనాబాద్ -1	8555818794
అమానాబాద్-2	8332006890
యండపల్లి-1	9949563505
యండపల్లి-2	9391545575
గోర్స	9392881512
పొన్నాడ-1	9704397769
పొన్నాడ-2	8106235468
కుతుకుడుమిల్లి	9493982629
వాకతిప్ప	9618788873
అమరవిల్లి	9059551199
కొత్తమూలపేట	9666855856
పాత, కొత్త ఇసుకపల్లి	9154403429

సినిమాలు



పెద్దాపురం

లలితా-1:	పుష్ప-2
లలితా-2:	పుష్ప-2
వీరభద్ర:	సీ202
శోభా:	పుష్ప-2
సామర్లకోట	
జయలక్ష్మి-1:	పుష్ప-2
జయలక్ష్మి-2:	పుష్ప-2
విఘ్నేశ్వరా:	పుష్ప-2

శరవణ భవ..!

- తాటిపర్తి, గొల్లప్రోలులో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలు ప్రారంభం
- నేడు వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

పిఠాపురం: నియోజకవర్గంలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. గొల్లప్రోలు మండలంలోని తాటిపర్తి, మల్లవరం, గొల్లప్రోలు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో షష్ఠి సంబరాలను అట్టహాసంగా ప్రారంభించారు. కాగా సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం తెల్లవారుజాము నుంచి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా తాటిపర్తి, మల్లవరం ఆలయాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు



తాటిపర్తిలో షష్ఠి మహోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

దర్శనాలకు ఏర్పాట్లు

తాటిపర్తిలో స్వామివారిని దర్శించుకోడానికి పిఠాపురం నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివస్తారు. సుమారు 1.50 లక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులు దర్శనానికి వచ్చే అవకాశం ఉండడంతో ఆలయం వద్ద క్యూలు, బారికేడ్లతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



ఏకే మల్లవరంలో షష్ఠి సంబరాలకు ముస్తాబైన ఆలయం

కల్యాణ అలంకరణలో స్వామి, అమ్మవార్లు

షష్ఠి ఉత్సవాల్లో భాగంగా తాటిపర్తిలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, అమ్మవార్లను శుక్రవారం పెండ్లికుమారుడు, కుమార్తెగా అలంకరించారు. ఆలయ అర్చకులు ఆకొండి వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు.


పుట్టలు రెడీ !

సాధారణంగా నాగుల చవితి నాడు పుట్టలో పాలు పోసి నాగేంద్రుడికి పూజలు చేయడం ఆనవాయితీ. కాగా షష్ఠి ఉత్సవాల్లో మాత్రం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పుట్టల్లో భక్తులు పాలు పోస్తారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి, ఏకే మల్లవరం తదితర ప్రాంతాల్లో శనివారం సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా ప్రత్యేక పుట్టలు సిద్ధం చేశారు. వందల సంఖ్యలో భక్తులు వీటిలో పాలు, గుడ్లు వేసి పూజలు చేసే విధంగా ఏర్పాట్లు చేశారు.



గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో సిద్ధం చేసిన పుట్టలు

షష్ఠి వేడుకలకు ఏర్పాట్లు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శనివారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి వేడుకలు నిర్వహిస్తున్నట్టు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. ఇందులో భాగంగా స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, పూజలు, పట్టు వస్త్రాలతో అలంకరణలు, అనంతరం భక్తుల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్టు తెలిపారు. అలాగే మండల పరిధిలోని పనసపాడు గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో షష్ఠి ఉత్సవాలు నిర్వహించనున్నామని, అనంతరం అన్నదానం చేయనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

మాతృదేవోభవ

- ఉగ్రషష్ఠి మండపాల్లో నిద్రిస్తే సంతాన ప్రాప్తి !
- గొల్లప్రోలు మండలంలోని షష్ఠి ఉత్సవాల్లో ఆచారం



నాగులచీర ధరించి గుడి వెనుక ప్రాంగణంలో నిద్రిస్తున్న మహిళలు (ఫైల్)



తాటిపర్తి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సిద్ధం చేసిన ఉగ్రషష్ఠి మండపాలు

పిఠాపురం: తల్లి అనిపించుకోవాలని ప్రతి మహిళా ఆరాట పడుతుంది. ఐదోతనంతో పాటు మాతృమూర్తిగా మారడానికి మహిళలు పడే కష్టం అంతా ఇంతా కాదు. చేయని పూజలు ఉండవు. సంతాన ప్రాప్తి కోసం మహిళలు వింత పూజలు చేసే ఆచారం గొల్లప్రోలు మండలంలోని సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి ఉత్సవాల్లో కనిపిస్తుంది. గొల్లప్రోలు మండలంలోని తాటిపర్తి, మల్లవరం, చేబ్రోలు, గొల్లప్రోలు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో నిద్రపోతే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఈ మేరకు ఏటా షష్ఠి ఉత్సవాల ప్రారంభ రోజున ఆలయాల చుట్టూ ప్రత్యేకంగా నిర్మించిన తాటాకు మండపాల్లో (ఉగ్ర షష్ఠి మండపాలు) ఎర్రని చీరలు ధరించి మహిళలు నిద్రపోతారు. అసలు ఆలయంలో నిద్ర పోవడమే తప్పుగా భావించే భక్తులు ఇక్కడ మాత్రం కావాలని మరీ నిద్రపోతుంటారు. కొత్తగా పెళ్లి అయ్యి ఇంకా పిల్లలు పుట్టని మహిళలు తమకు సంతాన ప్రాప్తి కలగాలని కోరుతూ ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉగ్రషష్ఠి మండపాల్లో షష్ఠి రోజు రాత్రి నిద్రపోతారు. ఇలా వచ్చిన వారి కోసం ప్రత్యేకమైన మండపాలను సిద్ధ చేస్తారు. వీటిని ఉగ్ర మండపాలుగా పిలుస్తుంటారు. సంతానాన్ని కలిగించే దేవుడిగా పూజలందుకునే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని సంతానం లేని మహిళలు ఉపవాస దీక్షతో స్వామి వారి చెంత నిద్ర పోయి తమ కోర్కె తీరాలని మొక్కుకోవడం తరతరాలుగా వస్తున్న ఆచారంగా స్థానికులు చెబుతున్నారు.

మండపాలు సిద్ధం చేశాం

సుబ్రహ్మణ్య స్వామి ఉగ్రషష్ఠి మండపంలో నిద్రిస్తే సంతానం కలుగుతుందని భక్తుల అపార నమ్మకం. ఇది వందల ఏళ్లుగా కొనసాగుతోంది. ఏటా వందల సంఖ్యలో పెళ్లైన మహిళలు సంతాన ప్రాప్తి కోసం ఇక్కడ నిద్ర చేస్తుంటారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు షష్ఠి ముందు రోజు రాత్రికే ఆలయాలకు చేరుకుంటారు. అర్ధరాత్రి నుంచి ఉగ్రషష్ఠి మండపంలో ఉపవాస దీక్ష చేసేందుకు సిద్ధమవుతారు. భక్తులు సౌకర్యార్థం ఉగ్రషష్ఠి మండపాలు సిద్ధం చేశాం.

ఆకొండి ప్రభాకరశాస్త్రి, ఆలయ అర్చకులు, అపర్ణాదేవి ఆలయం, తాటిపర్తి

అధికారుల తీరుకు నిరసనగా ఆందోళన



కొమరగిరిలో ఆల్ పర్పస్ బిల్డింగ్ నిర్మాణం కోసం తవ్విన గోతులను పూడ్చివేసిన దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరి శెట్టిబలిజపేటలో ఆల్ పర్పస్ బిల్డింగ్ నిర్మాణానికి గత ప్రభుత్వం అనుమతులు ఇస్తే కూటమి ప్రభుత్వంలో పంచాయతీ అధికారులు అడ్డుకుంటున్నారని శ్రీరామ శెట్టిబలిజ సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల తీరుకు నిరసనగా శుక్రవారం ఆందోళన నిర్వహించారు. సర్వే నంబర్ 785/1లో ఆల్ పర్పస్ బిల్డింగ్ నిర్మాణానికి 12 సెంట్లు భూమిని కేటాయిస్తూ 2022 మార్చి 31న పంచాయతీ సాధారణ సమావేశంలో ఆమోదించారన్నారు. కేటాయించిన స్థలాన్ని సుమారు రూ.6 లక్షలతో మెరక చేయించి బిల్డింగ్ నిర్మాణానికి గోతులు కూడా తీసినట్లు తెలిపారు. కాగా కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీ కార్యదర్శి భవన నిర్మాణానికి అనుమతులు లేవని తెలిపారన్నారు. పాత అనుమతులు రద్దు అయ్యాయని చెప్పి నవంబర్ 23న గోతులను పూడ్చివేసారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



తాటిపర్తిలో పోలీసులకు సూచనలు ఇస్తున్న కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు

కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు

పిఠాపురం: గొల్లప్రోలు మండలంలో సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవాలకు వచ్చే భక్తులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు సూచించారు. ఆయన శుక్రవారం తాటిపర్తిలో షష్ఠి ఉత్సవాల బందోబస్తును పర్యవేక్షించారు. మండలంలో తాటిపర్తి, మల్లవరం తదితర ప్రాంతాల్లో 12 మంది ఎస్సైలు, 100 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సుమారు 1.50 లక్షల మంది భక్తులు ఉత్సవాలకు హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. భక్తులు పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పిఠాపురం సీఐ శ్రీనివాస్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కాగా షష్ఠి ఉత్సవాల సందర్భంగా తాటిపర్తిలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

బెట్టింగ్ గ్యాంగ్ చిత్రం టీజర్ రిలీజ్

సామర్లకోట: చిన్న సినిమాలను ప్రభుత్వం ఆదుకోవాలని కౌడా చైర్మన్ తుమ్మల బాబు అన్నారు. సామర్లకోటకు చెందిన ఎస్ఎస్ యూనిట్ రెండో సినిమా 'బెట్టింగ్ గ్యాంగ్'కేరాఫ్ కాకినాడ సినిమాకు టీజర్‌ను ఆయన శుక్రవారం ఆయన లాంచ్ చేశారు. డ్రగ్స్, బెట్టింగ్స్ వలన యువత చెడిపోతున్న వాస్తవ పరిస్థితులపై చిత్రాన్ని రూపొందించినట్టు దర్శకుడు సత్య సలాది, నిర్మాతలు పిట్టా మణిరాజు, సలాది శ్రీనివాసు బాబు తెలిపారు. చిత్రంలో హీరోయిన్‌గా ఎలిసా గోస్, హీరోగా లక్ష్మణ్, విలన్‌గా సలాది శ్రీనివాసు బాబు, నీలం రమేష్, ఆది వంశీలు నటిస్తున్నారని చెప్పారు.

మ్యూజిక్ శివకల్యాణి చేశారన్నారు. కార్యక్రమంలో నటులు బడుగు బాబి, పిట్టా వరప్రసాద్, జానకి రామారావు, డాక్టరు సబ్బెల శ్రీను, బిక్కిన కుమార్, కరణం కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు అందరికీ ఆదర్శం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దవులూరి దొరబాబు



పిఠాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వంగా గీత, వైఎస్సార్ సీపీ నాయకులు



పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు

పెద్దాపురం: అంబేడ్కర్ ఆశయాలు సర్వమానవాళికి ఆదర్శంగా నిలుస్తాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ మిరియాల రాజాలతో కలిసి నివాళులర్పించారు. రాజ్యాంగంలోని చట్టాల ద్వారా ప్రజలకు హక్కులు కల్పించిన ఘనత ఆయనదేనన్నారు. అంబేడ్కర్ వంటి మహనీయుడి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అంబేడ్కర్ కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సాయి ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, ఆరెళ్ళి వీర్రాఘవులు, గుర్రాల యాకోబు, జాలా దావీదు తదితరులతో పాటు, సామర్లకోట మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, పాగా సురేష్, కాపగంటి కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే పట్టణ టీడీపీ ఆధ్వర్యంలో మున్సిపల్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు నివాళులర్పించారు. అదే ప్రదేశంలో సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు నీలపాల సూరిబాబు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. సీపీఎం డి.క్రాంతికుమార్, కూనిరెడ్డి అప్పన్న, నెక్కల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనే అసలైన నివాళి

సామర్లకోట: స్థానిక బలుసులపేట అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కౌన్సిలర్ నేతల హరిబాబు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఊబా జాన్ మోజెస్, అంబేడ్కర్ యువజన సంఘ నాయకులు పిట్టా సత్యనారాయణ(కౌన్సిలర్) లింగం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక బ్రౌన్‌పేటలో జీవీ రాఘవ, అందుగుల రాధాకృష్ణ, జార్జి చక్రవర్తి, సలాది వెంకటేశ్వరరావు, హుస్సేన్‌పురంలో చల్లా బుజ్జి అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులు అర్పించారు. పట్టణ, మండల పరిధిలో అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. రైల్వే స్టేషన్ ఆవరణలో స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చీఫ్ హెల్త్ సూపర్‌వైజరు కల్యాణి, సూపరింటెండెంట్ అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం నియోజకవర్గంలో...

పిఠాపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం పిఠాపురం నియోజకవర్గంలో వాడవాడలా నిర్వహించారు. పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీత ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పిఠాపురం రథాలపేట సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబి, వర్ధినీడి సుజాత, పచ్చిమళ్ల జ్యోతి, పిఠాపురం, గొల్లప్రోలు పట్టణ కౌన్సిలర్లు పాల్గొన్నారు. పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్, అధ్యాపకులు పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలను ప్రతిఒక్కరు గుర్తించుకోవాలని ఏపీ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుబ్బల రాజు అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా వెంకట్రావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైల్వే స్టేషన్ మాస్టర్ పి.నాగబాబు, మల్లాం సర్పంచ్ దాట్ల సూరిబాబు, విరవాడ సర్పంచ్ బోయి నాగేశ్వరరావు, చిన్న జగ్గంపేట మాజీ సర్పంచ్ గుల్ల కృష్ణ, బీసీ నాయకులు నాగేశ్వరరావు తదితరులు పూలమాలేసి నివాళులర్పించారు. గొల్లప్రోలులో ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ స్వప్న ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు.



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన స్టేషన్ మేనేజర్ తదితరులు



పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు



పిఠాపురం రైల్వే స్టేషన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు